సాక్షి రంగారెడ్డి

సోమవారం ⋅ 26 ⋅ మే ⋅ 2025



షెడ్ల నిర్మాణం

పాడి రైతులకు అండగా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం పశువుల షెడ్ల నిర్మాణానికి ముందుకు వచ్చింది.

8లో▸



లారీ ఢీకొని..

రహదారిపై ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తుండగా మృత్యురూపంలో దూసుకొచ్చిన లారీ హెడ్ కానిస్టేబుల్‌ను బలిగొంది.

8లో▸



వేలాడుతున్న ప్రమాదం

విచ్చలవిడిగా వెలుస్తున్న హోర్డింగ్‌లు, బ్యానర్లతో ప్రమాదాలు పొంచి ఉన్నా పట్టించుకునేవారు కరువయ్యారు.

8లో▸

న్యూస్‌రీల్

నేడు ఆమనగల్లులో తిరంగా ర్యాలీ

ఆమనగల్లు: ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన నేపథ్యంలో పట్టణంలో సోమవారం తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు నిర్వహణ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక పట్టణంలోని హనుమాన్ దేవాలయం నుంచి ర్యాలీ ప్రారంభమై పురవీధుల మీదుగా రాజీవ్‌చౌరస్తా వరకు కొనసాగుతుందని తెలిపారు. రాజకీయ పార్టీలు, కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు

చేవెళ్ల: ఫర్టిలైజర్, సీడ్స్ దుకాణాల డీలర్లు రైతులకు నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మినట్లు తేలితే చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయ అధికారి నర్సింహారావు అన్నారు. చేవెళ్లలోని రైతు వేదికలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో డివిజన్‌లోని ఫర్టిలైజర్, సీడ్స్ డీలర్లకు ఈపాస్ యంత్రపరికరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నర్సింహారావు మాట్లాడుతూ.. రైతులకు నాణ్యమైన గుర్తింపు పొందిన విత్తనాలు, ఎరువులనే విక్రయించాలని పేర్కొన్నారు. తప్పనిసరిగా రసీదులు అందించాలన్నారు. లైసెన్స్‌లు కలిగిన డీలర్లు మాత్రమే ఎరువులు, విత్తనాలు విక్రయించాలని సూచించారు. ఈపాస్ వినియోగంతో విక్రయాల వివరాలు పక్కాగా నమోదవుతాయని చెప్పారు. కార్యక్రమంలో డివిజన్ ఏడీ సురేశ్‌బాబు, ఏఓ శంకర్‌లాల్, చేవెళ్ల, శంకర్‌పల్లి, షాబాద్, మొయినాబాద్ మండలాలకు చెందిన డీలర్లు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం



శిబిరంలో రక్తదానం చేస్తున్న యువకులు

షాద్‌నగర్: రక్తదానంతో ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడొచ్చని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి భుజంగరెడ్డి అన్నారు. పట్టణంలోని పరిగి రోడ్డులో ఉన్న ఫిట్‌నెస్ క్లబ్‌లో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దానం చేసే ప్రతి రక్తపు బొట్టు ఆపదలో ఉన్న వారికి ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఆపదలో ఉన్న వారికి సరైన సమయంలో రక్తం దొరకక ఎన్నో ఇబ్బందులు పడుతుంటారని అన్నారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఫిట్‌నెస్ క్లబ్ నిర్వాహకుడు మధుకర్ రెడ్డి, యువసత్తా యూత్ అధ్యక్షుడు లక్ష్మణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కళాకారులను గుర్తించాలి

హయత్‌నగర్: రాష్ట్రంలో వృత్తి కళాకారులకు తగిన గుర్తింపు లేక పోవడంతో జీవనాధారం కష్టంగా మారిందని, వారిని గుర్తించి ప్రభుత్వం పెన్షన్ అందించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రచారి అన్నారు. ప్రజానాట్యమండలి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం కుంట్లూరులోని రావినారాయణరెడ్డి కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాటంలో, మలిదశ తెలంగాణ ఉద్యమంలో కళాకారులది కీలక పాత్ర అని పేర్కొన్నారు. వారిలో చదువుకున్న వారిని గుర్తించి సాంస్కృతిక శాఖలో ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. జిల్లా ప్రజా నాట్యమండలి జిల్లా బాధ్యుడు ముత్యాల యాదిరెడ్డి జెండాను ఆవిష్కరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి వేణుగోపాలచారి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా నాయకుడు హరి సింగ్‌నాయక్, మాజీ కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి జనసేవాదళ్ శిక్షణ శిబిరాలు

చేవెళ్ల: మున్సిపల్ కేంద్రంలో సోమవారం నుంచి ఈనెల 31వ తేదీ వరకు తెలంగాణ రాష్ట్ర జనసేవాదళ్ శిక్షణ శిబిరాలు ప్రారంభం కానున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, రాష్ట్ర నాయకుడు కె.రామస్వామి పేర్కొన్నారు. ఆదివారం వారు మాట్లాడుతూ.. ఈ శిక్షణ శిబిరాలను ప్రారంభించేందుకు పార్టీ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె. నారాయణ రానున్నట్లు తెలిపారు. ఆరురోజుల పాటు జరిగే ఈ శిక్షణ శిబిరాలకు జాతీయ, రాష్ట్ర నాయకులు హాజరవుతారని చెప్పారు.

బడి బస్సు.. భద్రమేనా?



మరి కొద్ది రోజుల్లో తెరుచుకోనున్న పాఠశాలల గేట్లు

- ఫిట్‌నెస్‌లేని బస్సులెన్నో..
- ఇప్పటికీ దృష్టి సారించని ఆర్టీఏ
- తరచూ వెలుగు చూస్తున్న ప్రమాదాలు
- ఆందోళనలో తల్లిదండ్రులు

హుడాకాంప్లెక్స్: కొత్త విద్యా సంవత్సరం మరికొద్ది రోజుల్లో ప్రారంభం కాబోతోంది. జూన్ 12 నుంచి బడిగేట్లు తెరుచుకోనుండగా అంతకు వారం రోజుల ముందు నుంచే ప్రైవేటు పాఠశాలల ద్వారాలు తెరుచుకోనున్నాయి. ఇంటికి సుదూరంగా ఉన్నా పిల్లల భవిష్యత్ కోసం తల్లిదండ్రులు మంచి పాఠశాలను ఎంచుకుంటున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా నిత్యం ఉదయం, సాయంత్రం వేళ వారిని డ్రాప్‌చేయడం, పికప్ చేసుకోవడం లాంటి వెసులుబాటు అందరికీ లేకపోవడంతో చలావరకు స్కూలు బస్సులు, ఆటోలు, ఇతర ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. జిల్లాలోని మెజార్టీ ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు అడ్మిషన్లు, ఫీజు వసూళ్లపై చూపిస్తున్న శ్రద్ధ.. బడి బస్సులపై చూపడం లేదు. పాత వాహనాలకు కొత్తగా రంగులద్ది రోడ్లపై యథేచ్ఛగా తిప్పుతున్నాయి. తక్కువ వేతనానికి పనిచేసే ఎలాంటి అనుభవం, అర్హత లేని డ్రైవర్లను నియమించుకుని పిల్లల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయి. ఫిట్‌నెస్ లేని బస్సులపై ఆర్టీఏ కొరడా ఝుళిపించాల్సిందిపోయి.. యాజమాన్యాలు ఇచ్చే మామూళ్లకు కక్కుర్తిపడి కండిషన్ సరిగ్గా లేని బస్సులకు సైతం ఉన్నట్లు ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

50 శాతం స్కూలు బస్సుల వైపే..

జిల్లా వ్యాప్తంగా 40 ప్రైవేటు ప్రాథమిక పాఠశాలలు ఉండగా 5,240 మంది పిల్లలు విద్యాభ్యాసం సాగిస్తున్నారు. ఇక ప్రైవేటు ప్రాథమికోన్నత పాఠశాలలు 535 ఉండగా, వీటిలో 93,942 మంది పిల్లలు చదువుతున్నారు. వీరిలో 50 శాతం మంది విద్యార్థులు స్కూలు బస్సులను ఆశ్రయిస్తుండగా, మరో 25 శాతం మంది ఆటోలు, 15 శాతం మంది తల్లిదండ్రుల బైకులు, కార్లలో వస్తుంటారు. మిగిలిన వారు కాలినడకన ఆయా స్కూళ్లకు చేరుకుంటారు.

అనుభవ లేమి.. ఫిట్‌నెస్ లేక..

కనీస అనుభవం, అర్హత లేని వారిని డ్రైవర్లుగా నియమించుకోవడంతో పాటు ర్యాష్ డ్రైవింగ్, ఫిట్‌నెస్ లేని బస్సుల కారణంగా తరచూ ప్రమాదాలు వెలుగు చూస్తున్నాయి. చిన్నారుల మృత్యువాతకు, గాయాలపాలు కావడానికి కారణమవుతున్నాయి. గతంలో షాద్‌నగర్, హయత్‌నగర్, చేవెళ్ల, శంకర్‌పల్లి, ఇబ్రహీంపట్నంలో పలు ప్రమాదాలు జరగడం.. అమాయక చిన్నారులు బస్సు చక్రాల కింద నలిగిపోయిన సంఘటనలు వెలుగుచూశాయి. ఏదైనా ఘటన జరిగినప్పుడు మాత్రమే ఆర్టీఏ అధికారులు హడావుడి చేస్తున్నారు. తర్వాత బడి బస్సుల భద్రతను గాలికొదిలేస్తున్నారు. దీంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతూనే తప్పనిసరి పరిస్థితుల్లో తమ పిల్లలను బస్సుల్లో పంపిస్తున్నారు.

ఈ నిబంధనలు తప్పనిసరి



- 15 ఏళ్లు నిండిన బస్సుల్లో పాఠశాల విద్యార్థులను తీసుకెళ్లడానికి వీలు లేదు.
- తప్పనిసరిగా ఐదేళ్ల అనుభవం ఉన్న వాళ్లనే డ్రైవర్లుగా నియమించుకోవాలి.
- ప్రతి మూడు నెలలకోసారి కంటిచూపు, రక్తపోటు, మధుమేహ పరీక్షలు చేయించాలి.
- 60 ఏళ్లు నిండిన వాళ్లను డ్రైవర్లుగా నియమించరాదు.
- కచ్చితంగా ప్రాథమిక చికిత్స పెట్టెను ఉంచాలి. అందులో కావాల్సిన మందులను ఎప్పటికప్పుడు సమకూర్చాలి.
- పాఠశాల, కళాశాల పేరు/ఫోన్ నంబర్/పూర్తి చిరునామాను బస్సుకు ఎడమవైపు వెనుక భాగంలో కన్పించేలా రాయించాలి.
- బస్సుకు కనీసం ఒక అటెండర్‌ను ఏర్పాటు చేయాలి.
- పిల్లలు ఎక్కేది, దిగేది డ్రైవర్‌కు స్పష్టంగా కనిపించేలా కుంభాకార అద్దాలు అమర్చుకోవాలి.
- లోపల ఒక పెద్ద పారదర్శక కుంభాకార అద్దం సైతం ఏర్పాటు చేయాలి.
- ఇంజన్ కంపార్ట్‌మెంట్‌లో ఒక అగ్నిమాపక యంత్రం, పొడి అందుబాటులో ఉంచాలి.
- విద్యార్థులు తమ పుస్తకాల బ్యాగులను ఉంచుకునేలా ప్రత్యేక ర్యాక్‌లు ఏర్పాటు చేయాలి.
- ప్రతి విద్యాసంస్థ తాము కలిగిన పది బస్సులకు అదనంగా మరో బస్సును ఉంచుకోవాలి.
- కిటికీల మధ్యలో ఇనుప కడ్డీలను అమర్చాలి.
- ఫుట్‌బోర్డుపైమొదటి మెట్టు భూమికి 325 మిల్లీమీటర్ల ఎత్తుకు మించకుండా ఏర్పాటు చేసుకోవాలి.
- అన్ని మెట్లు జారకుండా ఉండే లోహంతో నిర్మించాలి.

– (గజ్జల సదానందం, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్)

ఎదురుతెన్నులు

- ఇప్పటికీ ఛత్తీస్‌గఢ్ ఆస్పత్రిలోనే విజయలక్ష్మి మృతదేహం
- అక్కడే పడిగాపులు కాస్తున్న కుటుంబ సభ్యులు



విజయలక్ష్మి (ఫైల్)

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఛత్తీస్‌గఢ్‌లోని అబుజ్‌మడ్ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్టు విజయలక్ష్మి (36) అలియాస్ భూమిక మృతదేహం కోసం కుటుంబ సభ్యులు, బంధువులకు ఎదురు చూపులు తప్పడం లేదు. ఎన్‌కౌంటర్‌లో నంబాల కేశవరావుతో పాటు కేశంపేట మండలం వేములనర్వకు చెందిన విజయలక్ష్మి కూడా చనిపోయింది. మృతదేహాన్ని తీసుకొచ్చేందుకు కుటుంబ సభ్యులు, బంధువులు శనివారం రాత్రి షాద్‌నగర్ నుంచి బయలుదేరి ఆదివారం మధ్యాహ్నం ఛత్తీస్‌గఢ్ నారాయణపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకున్నారు. పోస్టుమార్టం తర్వాత పలువురి మృతదేహాలను వారి బంధువులకు అప్పగించారు. విజయలక్ష్మి మృతదేహాన్ని మాత్రం ఇప్పటికీ అప్పగించకపోవడంతో బంధువులు ఆందోళన చెందుతున్నారు. ఛత్తీస్‌గఢ్ పోలీసులకు స్థానిక పోలీసుల నుంచి ఆదేశాలు అందకపోవడమే ఈ జాప్యానికి కారణమని తెలుస్తోంది. తెలంగాణ మలిదశ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన భూమిక 12 ఏళ్ల క్రితం అజ్ఞాతంలోకి వెళ్లింది.

ఓయూ నుంచి అబుజ్‌మడ్ వరకు

వేములనర్వ గ్రామానికి చెందిన వన్నాడ సాయిలు, రాధమ్మ దంపతులకు ముగ్గురు సంతానం. ముగ్గురూ ఆడపిల్లలే. మూడో సంతానమైన విజయలక్ష్మి పుట్టిన ఏడాదికే తల్లి పాము కాటుతో చనిపోయింది. ఇంటర్మీడియెట్ వరకు కేశంపేటలోనే చదువుకుంది. ఒకవైపు చదువుకుంటూనే మరోవైపు పిల్లలకు ట్యూషన్లు చెప్పేది. మహబూబ్‌నగర్ ఎన్టీఆర్‌కాలేజీలో డిగ్రీ పూర్తి చేసింది. తర్వాత 2009–10లో ఓయూ పీజీ కాలేజీలో ఎంఏ పొలిటికల్ సైన్స్‌లో చేరింది. మలిదశ తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొంది. పలు మార్లు జైలుకు కూడా వెళ్లి వచ్చింది. ఇదే సమయంలో పోలవరం ముంపు గ్రామాలను సందర్శించి, ఆదివాసీల కష్టాలను చూసి చలించిపోయింది. ఈ ఘటన ఆమెపై తీవ్ర ప్రభావం చూపింది. 2013–14 మధ్య కాలంలో విజయలక్ష్మి అజ్ఞాతంలోకి వెళ్లింది. మావోయిస్టు పార్టీలో చేరిన మొదటి రోజు విషయాలను 'వసంత మేఘం' అనే వెబ్‌సైట్‌లో 'కొత్త బంగారులోకం' అనే శీర్షికతో ఓ కథను కూడా రాసింది. తానెందుకు గెరిల్లాగా మారాననే అంశాలతో పాటు ఓయూ కేంద్రంగా కొనసాగిన తెలంగాణ మలిదశ ఉద్యమాన్ని గుర్తు చేసుకుంది. 12 ఏళ్ల పాటు మావోయిస్టు పార్టీలో పని చేసి, చివరికి ప్రధాన కార్యదర్శి నంబాల రక్షణ బృందంలో పని చేస్తూ మరణించింది.

భూమికగా ఎలా మారిందంటే..?

విజయలక్ష్మి కేశంపేటలో ఇంటర్మీడియెట్ (2001–2003) పూర్తి చేసింది. అదే సమయంలో 'ఒక్కడు' సినిమా విడుదలైంది. ఆ సినిమాలోని హీరోయిన్ భూమిక పోలికలు కలిగి ఉండటంతో స్నేహితులంతా ఆమెను భూమికతో పోల్చుతూ అదే పేరుతో పిలిచేవారు. అజ్ఞాతంలోకి వెళ్లిన తర్వాత కూడా అదే పేరుతో కొనసాగినట్లు సమాచారం. చిన్నప్పటి నుంచి ఆమెకు సంగీతం, వ్యాసరచన అంటే ఇష్టం. ఇతరులకు సాయపడాలనే తపన బలంగా ఉండేది. ఇదే భావన మావోయిస్టు పార్టీ వైపు నడిపించింది. అజ్ఞాతంలోకి వెళ్లిన తర్వాత ఇంటి ముఖం కూడా చూడలేదు. ఆమె ఎక్కడికి వెళ్లిందనే అంశంపై కుటుంబ సభ్యులు ఆరా కూడా తీయలేదు. తమతో కలిసి చదువుకున్న తోటి విద్యార్థిని మావోయిస్టు పార్టీలో చేరి, ఏళ్ల పాటు అజ్ఞాతంలో ఉండిపోయి చివరికి ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన విషయం తెలుసుకుని ఆమె స్నేహితులు అశ్రునివాళి అర్పిస్తున్నారు. అప్పట్లో ఆమెతో కలిసి చేసిన మలిదశ తెలంగాణ ఉద్యమ పోరాటం, కాలేజీలో కలిసి దిగిన ఫొటోలను సోషల్ మీడియా వేదికగా షేర్ చేసుకుంటున్నారు.

భూములు లాక్కొని పొట్టకొట్టొద్దు



ఆందోళన చేపడుతున్న రైతులు

రైతుల ఆందోళన

తుర్కయంజాల్: అబ్దుల్లాపూర్ మెట్ మండలం కొహెడ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 187/1లో 50 ఏళ్లుగా వ్యవసాయం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నామని, ప్రభుత్వం తమ భూమిని లాక్కోవడానికి ప్రయత్నం చేస్తోందని పలువురు రైతులు వాపోయారు. కొహెడలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జీవనాధారంగా ఉన్న భూమిని లాక్కొని తమ పొట్ట కొట్టొద్దని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవలి కాలంలో రెవెన్యూ అధికారులు 288 ఎకరాలకు ప్రీకాస్ట్ వాల్ ఏర్పాటు చేశారని, సుమారు 100కుపైగా రైతు కుటుంబాలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వాలు భూమి లేని కుటుంబాలు వ్యవసాయం చేసుకుని బతకడానికి కుటుంబానికి ఎకరం, రెండు ఎకరాల చొప్పున కేటాయించాయని.. అప్పటి నుంచి ఆ భూముల్లో పలు రకాల పంటలు పండిస్తున్నామని తెలిపారు. భూములను లాక్కుంటే చూస్తూ ఊరుకోమని, పెద్ద ఎత్తున ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు. అధికారులు భూములను లాక్కునే ప్రయత్నాలు మానుకుని పట్టాలు పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

కాన్సులేట్‌కు కుచ్చుటోపీపై డిస్కం ఆరా!

సాక్షి, రంగారెడ్డిజిల్లా: భూగర్భ విద్యుత్ లైన్ల (యూజీ కేబుల్స్) ఏర్పాటు పేరుతో సైబర్‌సిటీ సర్కిల్ పరిధిలోని ఓ కాన్సులేట్ కార్యాలయానికి ఇంజనీర్లు, కాంట్రాక్టర్లు కలిసి కుచ్చుటోపీ పెట్టిన అంశంపై దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ ఆరా తీసినట్లు తెలిసింది. ఈ అంశంపై సమగ్ర విచారణకు ఆదేశించినట్లు సమాచారం. గచ్చిబౌలి, నానక్‌రాంగూడ సబ్‌స్టేషన్ల నుంచి కాన్సులేట్‌కు రెండు మార్గాల్లో యూజీ కేబుళ్లు వేసిన విషయం తెలిసిందే. అంచనాలను అడ్డగోలుగా పెంచడంతో పాటు ట్రంచ్ వేయకుండానే వేసినట్లు చూపించిన వైనంపై ఇటీవల 'సాక్షి'లో 'కాన్సులేట్‌కు కరెంట్ షాక్' శీర్షికన కథనం ప్రచురితమైన విషయం విదితమే. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ సహా పర్యవేక్షించిన ఇంజనీర్లు ఈ కథనంతో ఉలిక్కిపడ్డారు. ఈ అంశంపై సమగ్ర విచారణ జరిపి, తుది నివేదికను అందజేయాల్సిందిగా సీఎండీ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది.

నేడు తలకొండపల్లికి డిప్యూటీ సీఎం




ఖానాపూర్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తదితరులు

- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు: తలకొండపల్లి మండలంలో సోమవారం డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క పర్యటించనున్నారు. ఖానాపూర్ గ్రామంలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. ఈ నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. రూ.218 కోట్ల అభివృద్ధి పనులకు ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క శంకుస్థాపన చేయనున్నారు. రూ.200 కోట్లతో 25 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించే యంగ్ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి, రూ.18 కోట్లతో నిర్మించే 8 విద్యుత్ సబ్‌స్టేషన్‌ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. అనంతరం ఖానాపూర్‌లో జరిగే బహిరంగ సభలో మాట్లాడతారు. ఈ మేరకు పర్యటన ఏర్పాట్లను ఆదివారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పరిశీలించారు. బహిరంగ సభకు నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల నుంచి జనసమీకరణ చేయనున్న నేపథ్యంలో కూర్చోవడానికి వీలుగా అదనంగా టెంట్లు వేయాలని సూచించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. డిప్యూటీ సీఎంతో పాటు మంత్రి జూపల్లి కృష్ణారావు, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి, ఏఐసీసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి తదితరులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఎమ్మెల్యే వెంట పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీత, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, పార్టీ మండల అధ్యక్షుడు డోకూరు ప్రభాకర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారం



లబ్ధిదారులకు పత్రాలు అందజేస్తున్న చల్లా నర్సింహారెడ్డి

టీయూఎఫ్ఐడీసీ ఛైర్మన్ చల్లా నర్సింహారెడ్డి

మీర్‌పేట: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో పేదల సొంతింటి కల సాకారమవుతోందని టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని 19వ డివిజన్ అంబేడ్కర్‌నగర్‌లో ఆదివారం ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఎంపికైన లబ్ధిదారులకు కమిషనర్ జ్ఞానేశ్వర్‌తో కలిసి పత్రాలు అందజేసి ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించారు. అనంతరం నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. పేద ప్రజల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని అన్నారు. ఇళ్ల నిర్మాణం కోసం రూ.5 లక్షలు అందజేయడంపై హర్షం వ్యక్తం చేశారు. మాజీ కార్పొరేటర్ బైగళ్ల బాలమణి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు ఓంప్రకాశ్, నాయకులు చల్లా బాల్‌రెడ్డి, గజ్జెల రాంచందర్, సిద్దాల దశరథ, పల్లె పాండుగౌడ్, సురేందర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, సిద్దేశ్వరచారి, ఎస్సీసెల్ మీర్‌పేట అధ్యక్షుడు మాదరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దాడికి ప్రతిదాడి తప్పదు

- పాక్ వంకర తోకను కత్తిరించేస్తాం
- ప్రధాని చెప్పిన విషయాలను ఆచరించాలి
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి
- సనత్‌నగర్‌లో 'ప్రధాని మోదీ మన్ కీ బాత్' వీక్షణ



మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న కిషన్‌రెడ్డి, మర్రి శశిధర్‌రెడ్డి తదితరులు

సనత్‌నగర్: ఉగ్రదాడులపై దేశ ప్రజలు ప్రాణాలు కోల్పోతే గులాబీ పూలతో, క్యాండిల్స్ వెలిగించి నివాళులు అర్పించే విధానానికి ప్రధాన మంత్రి మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం స్వస్తి పలికిందని, దాడి చేస్తే ప్రతి దాడి తప్పదని, ఒక్కరిని చంపితే వంద మందిని చంపుతామనే విధానాన్ని పాక్ ఉగ్రవాదులకు కళ్లకు కట్టినట్లు చూపించామని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ మన్ కీ బాత్ 122వ ఎపిసోడ్‌ను ఆదివారం సనత్‌నగర్ నియోజకవర్గంలో ప్రజలు, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన వీక్షించారు. ఇందులో ప్రధాని మాట్లాడిన ముఖ్యమైన స్వచ్ఛత, యోగా, డయాబెటిస్ లాంటి విషయాలను ఆచరణలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రధాని మన్ కీ బాత్ ప్రజలను జాగృతం చేస్తుందని, ఐక్యంగా నిలబెడుతుందని, ఆరోగ్యవంతమైన సమాజాన్ని రూపొందిస్తుందని చెప్పారు. ఇందులోని ప్రధాని చేసిన సూచనలు, సలహాలు ప్రతిఒక్కరూ తప్పకుండా ఆచరించాలని కోరారు.

ఆపరేషన్ సిందూర్‌తో గట్టి సందేశం

లుంబినీ పార్కు, గోకుల్ చాట్, సాయిబాబా టెంపుల్, దిల్‌సుఖ్‌నగర్ పేలుళ్లు, ముంబై దాడులు, పార్లమెంట్‌పై దాడి.. ఇలా అనేక దాడులతో గత 46 ఏళ్లుగా పాక్ ఉగ్రవాదాన్ని భారత్‌పై ఎగదోస్తూ అనేక మంది ప్రాణాలను బలి తీసుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దాడుల సమయంలో నివాళులర్పించి సరిపెట్టుకునేవారమన్నారు. కానీ మోదీ ప్రభుత్వం వచ్చాక పఠాన్ కోట్–సర్జికల్ స్ట్రైక్, పుల్వామా–ఎయిర్ స్ట్రైక్, పహల్గామ్–ఆపరేషన్ సిందూర్ ద్వారా ఉగ్రవాదాన్ని, దానిని పెంచి పోషించే దేశాన్ని కూడా మట్టి కలిపేస్తామనే గట్టి సందేశాన్ని ప్రధాని మోదీ ఇచ్చారన్నారు. ఇలాంటి సమయాల్లోనే పార్టీలు, కులాలు, మతాలు, వర్గాలు, వర్ణాలు అనేవి పక్కన పెట్టి దేశమంతా ఐక్యతగా నిలవాల్సిని అవసరం ఉందన్నారు. పహల్గాం దాడి అతి క్రూరమైనదన్నారు. పిల్లల ముందు తండ్రిని, భార్య ముందు భర్తను చంపారని కిషన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మోదీకి చెప్పుకోండని హెచ్చరికలు కూడా జారీ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరి ఆగడాలకు భారత్ ఆపరేషన్ సిందూర్ ద్వారా గట్టి సమాధానం ఇచ్చిందన్నారు. ఇకపై భారత్‌లో జరిగే ప్రతి దాడికి సమాధానం ఇచ్చి తీరుతామన్నారు. ఉగ్రదాడులపై పాక్ 'కుక్క తోక వంకర' అన్నట్లే ప్రవర్తిస్తే ఆ తోకనే కత్తిరించేస్తామని హెచ్చరించారు. బీజేపీ సనత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు సిర్మనీ నరేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సనత్‌నగర్ మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్, రాష్ట్ర నాయకులు లింగంపల్లి నర్సింగరావు, దయానంద్, మూల రవీందర్, సదాశివయాదవ్, ఆకుల మహేష్, క్రాంతికుమార్, వెంకట్ సుబ్బారావు, శ్రీకాంత్‌యాదవ్, రవిచందర్, వై.శ్రీనివాసరావు, చంద్రకుమార్, సుమన్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని హెడ్‌కానిస్టేబుల్ దుర్మరణం



అంత్యక్రియల్లో గాలిలో కాల్పులు జరుపుతున్న పోలీసులు

- రహదారిపై ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తుండగా ప్రమాదం
- పెద్దషాపూర్ శివారులో జాతీయ రహదారిపై ఘటన

శంషాబాద్ రూరల్: రహదారిపై ఆగి ఉన్న వాహనాన్ని పక్కకు తొలగించి ట్రాఫిక్ ను క్రమబద్ధీకరిస్తుండగా.. మృత్యురూపంలో దూసుకొచ్చిన లారీ హెడ్ కానిస్టేబుల్‌ను బలిగొంది. మండలంలోని పెద్దషాపూర్ సమీపంలో శనివారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బెంగళూరు జాతీయ రహదారిపై షాద్‌నగర్ నుంచి శంషాబాద్ వైపు వెళ్తున్న లారీ పెద్దషాపూర్ శివారులో రోడ్డు కిందికి దూసుకెళ్లడంతో రహదారిపై ట్రాఫిక్ సమస్య తలెత్తింది. సమాచారం అందుకున్న హైవే ప్యాట్రోలింగ్ సిబ్బంది యాదయ్య, శ్రీనివాస్ అక్కడికి చేరుకున్నారు. అదే సమయంలో శంషాబాద్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందడంతో హెడ్ కానిస్టేబుళ్లు డి.విజయ్‌కుమార్, డి.చెన్నయ్య కూడా అక్కడికి వెళ్లారు. రోడ్డు కిందకు వెళ్లిన లారీ డ్రైవర్‌తో మాట్లాడి.. ట్రాఫిక్‌కు నియంత్రిస్తున్నారు. అదే సమయంలో షాద్‌నగర్ వైపు నుంచి శంషాబాద్ వస్తున్న లారీ అతి వేగంగా రెండు పెట్రోల్ మొబైల్ వాహనాలను ఢీకొడుతూ.. అక్కడే నిలబడి ఉన్న పోలీసులను ఢీకొట్టింది. ఈ ఘటనలో హెడ్‌కానిస్టేబుల్ విజయ్‌కుమార్‌కు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. హైవే ప్యాట్రోల్ మొబైల్ సిబ్బంది యాదయ్య, శ్రీనివాస్‌కు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. తాగిన మత్తులో లారీని అతి వేగంగా నడుపుతూ ఈ ప్రమాదానికి కారణమైన డ్రైవర్ రమేష్ కాంబ్లెను అదుపులోకి తీసుకున్నారు. విజయ్‌కుమార్ మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



విజయ్‌కుమార్ (ఫైల్)

నెలరోజుల క్రితమే ప్రమోషన్..

ఏడాది క్రితమే శంషాబాద్ పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వచ్చిన విజయ్‌కుమార్‌కు నెల కిందట హెడ్ కానిస్టేబుల్‌గా ప్రమోషన్ వచ్చింది. అతడి మృతితో పోలీస్‌స్టేషన్‌లో విషాదఛాయలు అలముకున్నాయి.

కన్నీటి నివాళి

షాబాద్: శంషాబాద్ మండలం పెద్దషాపూర్ వద్ద రోడ్డు ప్రమాదంలో హెడ్ కానిస్టేబుల్ దాదె విజయ్‌కుమార్(40) మృతి చెందాడు. ఆయన అంత్యక్రియలు ఆదివారం మండలంలోని కుర్వగూడలో పోలీసు లాంఛనాలతో నిర్వహించారు. శంషాబాద్ జోన్ డీసీపీ రాజేశ్, ఏసీపీ శ్రీకాంత్‌గౌడ్, సీఐలు నరేందర్‌రెడ్డి, కాంతారెడ్డి, శంషాబాద్ పోలీస్ స్టేషన్ సిబ్బంది, విజయ్‌కుమార్ 2006 బ్యాచ్‌మెంట్స్ అంత్యక్రియలో పాల్గొని కన్నీటి నివాళులర్పించారు. హెడ్ కానిస్టేబుల్ విజయ్‌కుమార్‌కు భార్య స్వాతి, ఇద్దరు కుమారులు అశ్వద్, అరిహంత్, తల్లిదండ్రులు ఉన్నారు. ఆయన మరణవార్తతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. బంధువులు, మండల ప్రజలు పెద్ద ఎత్తున్న తరలి వచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



దేవ్‌సింగ్ (ఫైల్)

కందుకూరు: రోడ్డు ప్రమాదం ఓ యువకుడిని పొట్టన పెట్టుకుంది. ఈ సంఘటన కందుకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ సీతారాం తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని బేగంపేట పంచాయతీ పరిధిలోని గాజులబురుజుతండాకు చెందిన రమావత్ పాడ్య కుమారుడు దేవ్‌సింగ్(24) శనివారం సాయంత్రం బైక్‌పై కూరగాయలు తేవడానికి బేగంపేటకు బయలుదేరాడు. మార్గమధ్యలో ఆంజనేయస్వామి గుడి వద్ద ఎదురుగా అతివేగంగా వస్తున్న లారీ అతని బైక్‌ను ఢీకొట్టింది. దీంతో దేవ్‌సింగ్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మరణించాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పోలీసులు ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు ఆదివారం ఎస్ఐ పరమేష్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

వ్యక్తి అదృశ్యం



శ్రీకాంత్ (ఫైల్)

మీర్‌పేట: వ్యక్తి అదృశ్యమైన సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సారంగపాణి కథనం ప్రకారం.. బడంగ్‌పేట బాలాజీనగర్‌లో నివాసముండే ఎస్.శ్రీకాంత్(41) వృత్తిరీత్యా డ్రైవర్. ఇతనికి భార్య కవిత, ముగ్గురు కుమార్తెలున్నారు. గతంలో భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో కవిత ముగ్గురు పిల్లలను తీసుకుని గజ్వేల్‌లోని కేసారమైన పుట్టింటికి సంవత్సరం క్రితం వెళ్లి తిరిగి రాలేదు. దీంతో శ్రీకాంత్ అప్పుడప్పుడు భార్యాపిల్లల వద్దకు వెళ్లి వస్తుంటాడు. వారం రోజుల క్రితం శ్రీకాంత్ ఇంట్లో తల్లికి చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆచూకీ కోసం వెతికినా ప్రయోజనం లేకపోవడంతో తల్లి నర్సమ్మ ఆదివారం మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధి హామీలో షెడ్ల నిర్మాణం

- పాడి రైతులకు అండగా కేంద్ర ప్రభుత్వం
- అవగాహన కల్పిస్తున్న అధికారులు



బొబ్బిలి గ్రామంలో నిర్మాణం పూర్తి చేసిన పశువుల షెడ్డు

షాబాద్: పాడి రైతులకు అండగా కేంద్ర ప్రభుత్వం పశువుల షెడ్ల నిర్మాణానికి ముందుకు వచ్చింది. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా శ్రీకారం చుట్టింది. గ్రామీణ ప్రాంతాల్లోని పశు పోషకుల్లో జాబ్ కార్డు కలిగి ఉన్నవారు పశువుల షెడ్ల నిర్మాణం చేపట్టవచ్చు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు 8 మంది రైతులు పశువుల షెడ్లు నిర్మించుకున్నారు. గరిష్టంగా పశువుల షెడ్లకు రూ.85 నుంచి రూ.90 వేల వరకు మంజూరు చేస్తున్నారు. పశువులకు ఎండావానల నుంచి కాపాడుకునేందుకు పాడి రైతుల కు ఇదో చక్కని అవకాశంగా ఉపయోగపడుతుంది.

షెడ్లకు బిల్లులు ఇలా

గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అధికారులు ఎప్పటికప్పుడు రైతులకు పశువుల షెడ్ల నిర్మాణం కోసం అవగాహన కల్పిస్తూనే ఉన్నారు. వాస్తవంగా ఐదు నెలల్లో 35 నిర్మించాల్సి ఉన్నప్పటికి 18 మంది రైతులు షెడ్ల నిర్మాణానికి ముందుకు వచ్చారు. దీని నిర్మాణంలో బేస్‌మెంట్, లెంటల్, రూఫ్ లెవల్ స్థాయిలు ఉంటాయి. వీటి ఆధారంగా రైతులకు బిల్లులు వస్తాయి. నిర్మాణం పూర్తయిన తర్వాత ఈజీఎస్ అధికారులతో పాటు పంచాయతీ కార్యదర్శి మొత్తం బిల్లులను లబ్ధిదారులకు అందిస్తారు. కాగా, ఉపాధి హామీ పథకంలో పనులు చేస్తే బిల్లులు సకాలంలో రావనే ఉద్దేశంతో అనేక మంది రైతులు పశువుల షెడ్ల నిర్మాణానికి ముందుకు రావడం లేదని తెలుస్తోంది. షాబాద్ మండలంలో 90 శాతం మంది అన్నదాతలున్నారు. వారి వద్ద ఎడ్లు, ఆవులు, గేదెలు ఉన్నాయి. వారికి షెడ్లు అవసరమే కానీ ఆర్థిక ఇబ్బందులు వల్ల కూడా అనేక మంది ముందుకు రావడం లేదు.

జాబ్‌కార్డు, తెల్లరేషన్‌కార్డు ఉండాలి

గ్రామీణ ప్రాంతాల్లోని రైతులకు ఉపాధి జాబ్ కార్డు తోపాటు తెల్లరేషన్ కార్డులు కలిగి ఉండాలి. ఐదెకరాల కంటే తక్కువగా ఉన్న చిన్న, సన్నకారు రైతులు అర్హుల. ఆవులు, ఎద్దులు, గేదెలు మూడు కన్నా ఎక్కువగా ఉండాలి. కోళ్లు అయితే 50 కన్నా ఎక్కువగా ఉండాలి. పశువుల షెడ్డు అవసరమని గ్రామ పంచాయతీ నుంచి అనుమతి, పశువులు కలిగి ఉన్నట్లు పశువైద్యాధికారి నుంచి ధ్రువీకరణ పత్రం తీసుకోవాలి. తెల్లరేషన్ కార్డు, జాబ్‌కార్డు, పంచాయతీ అనుమతి పత్రం, పశువైద్యాధికారి ధ్రువీకరణ పత్రాలతో ఉపాధి హామీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి.

రైతులు వినియోగించుకోవాలి



పాడి రైతులకు పశువుల షెడ్డు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. దరఖాస్తు చేసుకున్న వారికి పశువుల షెడ్లు మంజూరు చేస్తాం. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. నిర్మాణ దశలను బట్టి బిల్లులు అందజేస్తాం. – వీరాసింగ్, ఏపీఓ, షాబాద్

పాల వ్యాన్‌ను ఢీకొన్న బైక్

ప్రమాదంలో యువకుడి మృతి



గోపయ్య (ఫైల్)

మాడ్గుల: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని కోల్కులపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మేకల గోపయ్య(23) శనివారం రాత్రి శుభకార్యానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో స్నేహితుడి బైక్‌పై ఇంటికి వస్తున్నారు. మార్గమధ్యలో గ్రామ శివారులోని వైన్స్ సమీపంలో అదుపు తప్పి పాల వ్యాన్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో గోపయ్యకు తీవ్ర గాయాలవ్వడంతో మాల్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. స్నేహితుడు మహేశ్ తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నాడు. మృతుడి తండ్రి సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

టీజీఈసెట్-2025 ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: టీజీఈసెట్-2025 ఫలితాలను విడుదలయ్యాయి. ఆదివారం ఓయూ ఇంజినీరింగ్ కాలేజీలోని టీజీఈసెట్-2025 కార్యాలయంలో రాష్ట్ర ఉన్నత విద్య మండలి చైర్మన్ ప్రొ.బాలకిష్టారెడ్డి, కార్యదర్శి ప్రొ.శ్రీరామ్ వెంకటేష్, ఓయూ వీసీ ప్రొ.కుమార్, కన్వీనర్ ప్రొ.చంద్రశేఖర్ తదితరులు ఫలితాలను విడుదల చేశారు. ఈ నెల 12న జరిగిన ప్రవేశ పరీక్షకు 18,928 విద్యార్థులు హాజరుకాగా 17768 (93.87 శాతం) మంది అభ్యర్థులు అర్హత సాధించినట్లు తెలిపారు.

బైక్ అదుపుతప్పి..

యువకుడి మృతి

లాలాపేట: బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీసు స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం చోటు చేసుకుంది. పోలీసుల కతనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మెట్టుగూడ ఆలుగడ్డ బావి ప్రాంతానికి చెందిన మాధవన్(21) ఆదివారం ఉదయం బైక్‌పై ఉప్పల్‌కు వెళ్లాడు. అక్కడ పని ముగించుకుని తిరిగి వస్తుండగా అతి వేగం కారణంగా బైక్ అదుపుతప్పి హబ్సిగూడలోని మెట్రో పిల్లర్ నెంబర్ 1002 యూటర్న్ వద్ద డివైడర్‌ను ఢీకొన్నాడు. ఈ ఘటనలో అతని తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ హాస్పిటల్‌కు తరలించారు.

అనుమానం పెనుభూతమై..

భార్యపై కత్తితో భర్త దాడి

ఫిలింనగర్: భార్యపై అనుమానం పెంచుకున్న ఓ వ్యక్తి ఆమెపై కత్తితో దాడి చేసిన సంఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. తూర్పుగోదావరి జిల్లా అగ్రహారానికి చెందిన అప్పలరాజు, వెంకటరమణమ్మ దంపతులు ఫిలింనగర్‌లోని జ్ఞానీజైల్‌సింగ్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. వీరిద్దరూ సినీ పరిశ్రమలో పని చేస్తున్నారు. గత కొన్నాళ్లుగా భార్య ప్రవర్తనపై అనుమానం పెంచుకున్న అప్పలరాజు ఆమెకు వివాహేతర సంబంధాలు అంటగడుతూ హింసిస్తున్నాడు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో కొబ్బరి బోండాలు కొట్టే కత్తితో ఆమెపై దాడి చేయగా ఆమె చేతికి తీవ్ర గాయమైంది. స్థానికులతో కలిసి బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాగా నిందితుడు స్వయంగా పోలీసుల ఎదుట లొంగిపోయాడు. అప్పలరాజును అరెస్ట్ చేసిన ఫిలింనగర్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

యువకుడి అనుమానాస్పద మృతి

గచ్చిబౌలి: స్నేహితులతో కలిసి రాత్రి పార్టీ చేసుకున్న ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సీహెచ్.వెంకన్న కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. విజయనగరం జిల్లా, ప్రసాద్‌నగర్‌కు చెందిన లంక హర్షవర్ధన్(26) వారసిగూడలో నివాసం ఉంటూ సికింద్రాబాద్‌లోని ఓ ఏసీ కంపెనీలో సీనియర్ ఎగ్జిక్యూటివ్‌గా పని చేస్తున్నాడు. శనివారం తోటి ఉద్యోగులు, స్నేహితులైన కోరిబొల్లి కార్తీక్, అదితి పాత్ర, వినోద్ కుమార్‌లతో కలిసి కొండాపూర్‌లోని క్వక్ పబ్‌లో పార్టీ చేసుకున్నారు. అనంతరం గచ్చిబౌలిలోని సుమంజో అపార్ట్‌మెంట్‌లోని అదితి పాత్ర ఫ్లాట్‌కు వెళ్లారు. అక్కడ మళ్లీ మద్యం సేవించారు. ఆదివారం తెల్లవారు జామున హర్షవర్ధన్ వాంతులు చేసుకోవడంతో స్నేహితులు అతడిని సమీపంలోని ఏఐజీ హాస్పిటల్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. రాయదుర్గం పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాదచారుడిని ఢీకొట్టిన కారు

ఇబ్రహీంపట్నం రూరల్: రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన కారు ఓ పాదచారుడిని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అతడి కాలు విరిగిపోయింది. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. తుర్కయంజాల్‌లోని సూర్యనగర్ కాలనీకి చెందిన పున్న ఎల్లయ్య(73) సాగర్ హైవేపై కమాన్ వద్ద రోడ్డు దాటుతున్నాడు. బీఎన్‌రెడ్డి నుంచి ఇబ్రహీంపట్నం వైపు వస్తున్న కారు అతివేగంగా వచ్చి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆయన ఎడమకాలుకు తీవ్ర గాయమైంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నట్లు సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపారు.

మహిళను వేధిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

ఇబ్రహీంపట్నం రూరల్: మహిళను మానసికంగా వేధింపులకు గురి చేస్తున్న ఓ వ్యక్తిపై ఆదిబట్ల పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ రాజు కథనం ప్రకారం.. తుర్కయంజాల్‌లో నివాసం ఉండే ఓ మహిళకు ఆరేళ్ల క్రితం ఓ వ్యక్తితో ప్రేమ వివాహం జరిగింది. ఆమెకు ప్రస్తుతం ఇద్దరు పిల్లలున్నారు. ఆర్థిక సమస్యలతో 2022లో సదరు మహిళ బొంగ్లూర్‌లోని ఈకామ్ ఎక్స్‌ప్రెస్‌లో 8 నెలలు సెక్యూరిటీగా పని చేసింది. ఆ సమయంలో సహోద్యోగి ప్రవీణ్‌తో ఆమెకు స్నేహం ఏర్పడింది. అనంతరం ఆమె ఉద్యోగం మానేసి ఇంట్లోనే ఉంది. కానీ ప్రవీణ్ నిత్యం ఫోన్ చేసి మాట్లాడి మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ఆదిబట్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు ఆమె చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నట్లు తెలిపారు.

రైలు కింద పడి వ్యక్తి బలవన్మరణం

శంకర్‌పల్లి: మనోవేదనకు గురైన ఓ వ్యక్తి రైలు కింద పడి బలవన్మరణానికి పాల్పడిన సంఘటన ఆదివారం శంకర్‌పల్లి పరిధిలో చోటుచేసుకుంది. వికారాబాద్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని చిన్న శంకర్‌పల్లికి చెందిన జోన్నాడ బాలరాజ్(55)కు ఇద్దరు కుమారులున్నారు. నాలుగేళ్ల క్రితం భార్య చనిపోవడంతో.. తీవ్ర మనోవేదనకు గురవుతున్నాడు. ఆదివారం ఆయన మధ్యాహ్నం హుస్సేన్ సాగర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలుకి ఎదురెళ్లి.. బలవన్మరణానికి పాల్పడ్డా డు. లోకోపైలట్ ఇచ్చిన సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం వికారాబాద్ ఆసుపత్రికి తరలించారు. అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. ఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

లిఫ్టు అడిగి.. మృత్యు ఒడికి

స్కూటర్ నుంచి జారిపడి మహిళ మృతి

చేవెళ్ల: లిఫ్టు అడిగి స్కూటర్‌పై వెళ్తున్న ఓ మహిళ ప్రమాదవశాత్తు జారి పడి మృతి చెందింది. ఈ సంఘటన చేవెళ్ల మున్సిపాలిటీ కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇబ్రహీంపల్లికి చెందిన మంగళి లక్ష్మి(32) చేవెళ్లలో వివేకానంద పాఠశాలలో ఆయాగా పనిచేస్తోంది. ఆదివారం ఉదయం ఆమె ఇంటి నుంచి పనికోసం బయలు దేరింది. ఆలస్యం కావడంతో స్కూల్ బస్సు వెళ్లిపోయింది. దీంతో ఆమె బైక్ మీద లిఫ్టుపై వెళ్తోంది. మార్గమధ్యలో చేవెళ్లకు సమీపంలోకి రాగానే స్కూటర్‌పై నుంచి లక్ష్మి ప్రమాదవశాత్తు జారి పడి తలకు గాయమైంది. వెంటనే స్థానికులు పట్నం మహేందర్‌రెడ్డి ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలు భర్త సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో జింక మృతి




జింక కళేబరం

కందుకూరు: రోడ్డు ప్రమాదంలో రాష్ట్ర జంతువు జింక మృతి చెందింది. ఈ సంఘటన శనివారం రాత్రి శ్రీశైలం హైవే రాచులూరు గేట్ సమీపంలోని పెద్దమ్మ దేవాలయం వద్ద చోటు చేసుకుంది. రాత్రి సమయంలో రోడ్డు దాటుతున్న జింకను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఆదివారం ఉదయం సమాచారం అందుకున్న గుమ్మడవెల్లి అటవీ శాఖ అధికారి విజయ్ భాస్కర్ సిబ్బందితో ఆ జింకను రాచులూరు పశువైద్యశాలకు తరలించారు. కాగా పశువైద్యుడు డాక్టర్ షాహీన్‌షేక్ ఆ జింకకు పోస్టుమార్టం నిర్వహించి, అటవీ అధికారులకు అప్పగించగా దానికి వారు అంత్యక్రియలు నిర్వహించారు.

రెండు ఇళ్లలో చోరీ

సనత్‌నగర్: తాళాలు పగులగొట్టి రెండు ఇళ్లల్లో చొరబడిన గుర్తుతెలియని వ్యక్తి నగదు, సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లిన సంఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బేగంపేట తాతాచారి కాలనీలో మెండా కిషోర్ అనే వ్యక్తి నివాసం ఉంటున్నాడు. ఈ నెల 23న సాయంత్రం బైక్‌పై వచ్చిన గుర్తుతెలియని వ్యక్తి నేరుగా మొదటి అంతస్తుకు వెళ్లి నూతన ప్రసాద్ అనే వ్యక్తి ఇంటి తాళాన్ని పగులగొట్టి లోపలికి ప్రవేశించాడు. ఇంట్లో దొరికిన రూ.2 వేల నగదు అపహరించాడు. అక్కడి నుంచి గ్రౌండ్ ఫ్లోర్‌కు వచ్చి అద్దెకు ఉండే సాయికిరణ్ ఇంటి తాళాలు పగులగొట్టి రూ.4 వేల నగదుతో పాటు మొబైల్ ఫోన్ ఎత్తుకెళ్లాడు.

గాల్లో వేలాడుతున్న ప్రమాదం



చేవెళ్ల: విచ్చలవిడిగా వెలుస్తున్న హోర్డింగ్‌లు, బ్యానర్లతో ప్రమాదాలు పొంచి ఉన్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. చేవెళ్ల మున్సిపాలిటీ కేంద్రంలోని షాబాద్ చౌరస్తాలో ఆదివారం ఓ హోర్డింగ్‌కు కట్టిన బ్యానర్ గాలికి చిరిగిపోయి విద్యుత్ హైటెన్షన్ వైర్లపై పడి ఇలా ప్రమాదకరంగా మారింది. ఏ మాత్రం గాలి అధికంగా వీచినా పెను ప్రమాదం సంభవించే ఆస్కారం లేకపోలేదని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చినిగి పోయిన బ్యానర్లను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

సిటీలోనే 'సైబర్ హెల్పర్స్'!

మ్యూల్స్ ఖాతాలు తెరిచి సూత్రధారులకు సహాయం

- వర్క్ ఫ్రమ్ హోమ్ స్కామ్ దర్యాప్తులో వెలుగులోకి
- నలుగురిని అరెస్టు చేసిన సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు



సాక్షి, సిటీబ్యూరో: ఉత్తరాది కేంద్రంగా సైబర్ నేరాలు చేసే సూత్రధారులకు సహాయం చేసే పాత్రధారులు సిటీలోనూ ఉన్నారు. బోగస్ వివరాలతో బ్యాంకు ఖాతాలు తెరిచి ఇవ్వడం ద్వారా సహకరిస్తూ కమీషన్లు తీసుకుంటున్నారు. రూ.8.75 లక్షలతో ముడిపడి ఉన్న 'వర్క్ ఫ్రమ్ హోమ్ స్కామ్' దర్యాప్తులో ఈ విషయం గుర్తించిన హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు నలుగురు నిందితులను అరెస్టు చేశారు. వీరు అనేక బ్యాంకు ఖాతాలను తెరిచి, వాటి వివరాలను సూత్రధారులకు పంపినట్లు గుర్తించామని డీసీపీ దార కవిత ఆదివారం ప్రకటించారు. నగరానికి చెందిన ఓ మహిళకు ఈ ఏడాది జనవరి 2న టెలిగ్రాం యాప్ ద్వారా ఓ సందేశం వచ్చింది. అక్కర్ అడ్వాంటేజ్ ప్లస్ మార్కెటింగ్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ మానవ వనరుల విభాగం నుంచి వచ్చినట్లు అందులో ఉంది. ఈ పేరుతో ఓ నకిలీ వెబ్‌సైట్‌ను సృష్టించిన నేరగాళ్లు దాని యూఆర్‌ఎల్‌ను బాధితురాలికి పంపారు. తమ సంస్థ తరఫున వర్క్ ఫ్రమ్ హోమ్ విధానంలో పని చేయాలని కోరారు. ఏ ఇబ్బంది ఉండని ఈ ఉద్యోగం ద్వారా రోజుకు రూ.17 వేల నుంచి రూ.18 వేల వరకు సంపాదించుకునే అవకాశం ఉందని నమ్మించారు. ఆమె అంగీకరించడంతో ఆన్‌లైన్ హోటల్ బుకింగ్‌కు సంబంధించిన ఓ టాస్క్ ఇచ్చారు. ఇది పూర్తయిన తర్వాత అసలు కథ మొదలెట్టిన నేరగాళ్లు తమ వద్ద కొన్ని స్కీములు ఉన్నాయని, వాటిలో పెట్టుబడులు పెడితే భారీ లాభాలు వస్తాయని నమ్మించారు. తొలుత ఆమెతో రూ.10 వేలు పెట్టుబడి పెట్టించి, మరుసటి రోజే రూ.వెయ్యి లాభం పంచారు. ఆపై రూ.17,800, రూ.45,300 చొప్పున ఇన్వెస్ట్ చేయించారు. యానివర్సరీ స్పెషల్ ఆఫర్‌గా 'గోల్డ్ సూట్ బుకింగ్' విధానం ప్రవేశపెట్టామని, రూ.7.19 లక్షలు పెట్టుబడి పెడితే రూ.15.82 లక్షలు లాభం వస్తుందని చెప్పారు. ఆ మొత్తం పెట్టుబడిగా పెట్టాక నగదు తిరిగి ఇవ్వడానికి సెక్యూరిటీ డిపాజిట్ అంటూ మరికొంత మొత్తం బదిలీ చేయించుకున్నారు. ఇలా మొత్తం రూ.8,75,148 పెట్టుబడి పెట్టించిన కేటుగాళ్లు ఆమెను మోసం చేశారు. దీనిపై బాధితురాలి ఫిర్యాదుతో సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో కేసు నమోదైంది. ఏసీపీ ఆర్‌జీ శివ మారుతి నేతృత్వంలో ఇన్‌స్పెక్టర్ ఎం.సీతారాములు తమ బృందంతో ఈ కేసు దర్యాప్తు చేశారు. బాధితురాలు నగదు డిపాజిట్ చేసిన బ్యాంకు ఖాతాల ఆధారంగా దర్యాప్తు చేసిన అధికారులు ఈ మొత్తంలో కొంత నగరానికి చెందిన కొన్ని సంస్థల పేర్లతో తయారు చేసిన ఖాతాల్లోకి వెళ్లినట్లు గుర్తించారు. దీంతో వీటిని ఓపెన్ చేసిన నగరవాసులు మనోజ్ దివాకర్, నాగిరి విజయ్, సనపర్తి కిషోర్ బాబు, రంగారెడ్డి జిల్లాకు చెందిన టి.సంతోష్‌కుమార్‌లను అరెస్టు చేశారు. వీళ్లు సైతం టెలిగ్రాం యాప్ ద్వారానే ఆకర్షితులపై ప్రధాన సూత్రధారులతో జట్టుకట్టినట్లు వెలుగులోకి వచ్చింది. తాము ఓపెన్ చేసిన ఖాతాలకు సంబంధించిన వివరాలను వారికి పంపినట్లు అంగీకరించారు. ఈ నలుగురినీ అరెస్టు చేసిన పోలీసులు సూత్రధారుల కోసం గాలిస్తున్నారు.

ఆర్కన్ ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స

ఛాతి ఎముకలను తొలగించి కణితి తొలగించిన వైద్యులు

శంషాబాద్: ఛాతి ఎముకల వెనుక ఏర్పడిన క్లిష్టమైన కణితిని ఆర్కన్ ఆస్పత్రి వైద్యులు అరుదైన శస్త్రచికిత్స చేసి విజయవంతంగా తొలగించారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆదివారం ఆస్పత్రి వైద్య బృందం మీడియాకు వెల్లడించింది. మొయినాబాద్ మండలం మేడిపల్లి గ్రామానికి చెందిన రైతు కృష్ణ ఏడాది కిందట పొలంలో జరిగిన ప్రమాదంలో గాయపడ్డాడు. కొద్ది కాలం తర్వాత ఛాతి వెనుక తీవ్రమైన నొప్పి వస్తుండటంతో పలుచోట్ల వైద్యం చేయించుకున్నా తగ్గలేదు. ఇటీవల ఆర్కన్ ఆస్పత్రిలో చేరిన ఆయనకు సింగపూర్‌లో వైద్య విద్యనభ్యసించిన ప్రముఖ కార్డియోథొరాసిక్ వాస్కులర్ సర్జన్ అరుణ్ కనాల నేతృత్వంలో ప్లాస్టిక్ సర్జన్ మధువినయ్, ఆర్థోపెడిక్ వంశీమోహన్, క్రిటికల్ కేర్ వైద్యనిపుణులు ఖాద్రీ, ఆస్పత్రి ఎండీ, ఎమర్జెన్సీ మెడిసిన్ వైద్యనిపుణులు చంద్రకాంత్‌ల బృందం శస్త్ర చికిత్స ద్వారా గుండె, ఊపిరితిత్తులకు ఇబ్బందులు కలగకుండా ఛాతి ఎముకలను తీసి వెనుక ఉన్న కణితిని తొలగించారు. అక్కడ ప్రత్యేక లేయర్‌ను అమర్చినట్లు వైద్య బృందం వివరించింది. ఆరు రోజుల్లో రోగి పూర్తిగా కోలుకున్నాడని వైద్యులు వెల్లడించారు. ఈ సందర్భంగా రైతు కుటుంబ సభ్యులు వైద్యబృందానికి కృతజ్ఞతలు తెలిపారు.